# హోదా

## — సి.హెచ్.రామమూర్తి

ఆ రోజు రాజీని అత్తగారింటికి తీసుకెడుతున్నారు. ఎంతగా ఆపుకుందామన్నా ఆమె వల్ల కావడంలేదు. కళ్ళ నిండా నీళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయి. అప్పుడప్పుడు పమిట చెంగుతో కళ్ళు తుడుచుకుంటోంది. పెళ్ళైన ప్రతి ఆడపిల్లకు సహజంగా కలిగే దుఃఖమే అది. వాళ్ళ వూరికి బస్సు రాదు. వూరికి ఒక మైలు దూరం నడిచి మెయిన్ రోడ్డుకు వచ్చి బస్సెక్కాలి. ఆ బస్సైనా రెండు గంటల కొకటి ఉంది.

రోడ్డు పక్కన వున్న వేపచెట్టు నీడన ట్రంకు పెట్టె మీద కూర్చుని వుంది రాజీ. ఆమె భర్త శేషగిరి అల్లంత దూరంలో సిగరెట్ తాగుతూ బస్సు వచ్చే వైపు దృష్టి సారించి చూస్తూ నిల్చుని వున్నాడు. రాజీ తండ్రి రాఘవయ్య, రాజీకి ఎదురుగా నిల్చుని ఆమెను సముదాయించాలని విఫల ప్రయత్నం చేస్తున్నాడు.

ఇరవై సంవత్సరాల అనుబంధం ఒక్కసారి తెంచేసుకొని వెడుతోంది రాజీ. ఇకముందు తానా వూరికి పరాయిది.

"రాజీ! ఇది ప్రతి ఆడపిల్లకు తప్పనిసరైన దిగులు తల్లీ! కొన్నాళ్ళిలా అనిపించినా, తర్వాత నీకే తెల్సి వస్తుంది, ఈ సంబంధంలోని తీయదనం. పెళ్ళికాని ఆడపిల్లలు పడుతున్న మనోవేదనలు నీకు తెలియనిదా?" అనునయంగా అన్నాడు రాఘవయ్య.

"నాన్నా నా దిగులుకు కారణం నిజంగా నీకు తెలియదా?"

రాజీ ప్రశ్నకు అదిరిపడ్డాడు రాఘవయ్య. ఏం ప్రమాదం జరుగుతుందోనని, ఒకసారి అల్లుడికేసి చూచాడు. అతను వీళ్ళ సంభాషణ విన్నట్లు లేదు.

"రాజీ! ఇది సమయంకాదు. లేనిపోని ఆలోచనలతో నీ జీవితం చేజేతులా నాశనం చేసుకోకు". మందలింపుగా అన్నాడు రాఘవయ్య తన స్వర స్థాయిని తగ్గించి.

"లేదు నాన్నా! నా గొంతు నొక్కి నాకు అన్యాయం చేశావు. నేను ఏమీ చేయలేని ఆడదాన్నైనందు వల్ల నా మనసు చంపుకొన్నాను."

"రాజీ! స్మృతి మించుతున్నావు. నేను నా బిడ్డ శ్రేయస్సు కోరే తండ్రినే గానీ, కిరాతకుణ్ణి కాదు. కొన్ని కొన్ని పరిస్థితులు మొదట చేదుగా, బాధగా వున్నా, పోను పోను వాటి విలువ ఉపయోగం తెల్సి వస్తుంది. నీకు పుణ్యముంటుంది. అనవసరమైన, ఆలోచనలతో పండంటి జీవితాన్ని పాడుచేసుకోకు." తీవ్రంగాహెచ్చరించాడు రాఘవయ్య.

"ఏమిటి మామగారూ!" వాళ్ళ సంభాషణ అస్పష్టంగా వినిపించడంతో వాళ్ళిద్దరి వైపు వచ్చాడు శేషగిరి.

"ఏమి లేదు. అమ్మాయి మమ్మల్ని వదిలి వెళ్ళడానికి దిగులుపడుతూంది." సర్ది చెప్పాడు రాఘవయ్య.

"పోనీ ఆమెకు దిగులు తీరే వరకు కొన్నాళ్ళు ఇక్కడే వుంచుకోండి. నేను వారం, పది రోజుల తర్వాత వస్తాను" శేషగిరి అన్నాడు.

"అదేంటి బాబూ!" ఏనాటికైనా నీ వెంట రావలసిందేగా ..."

"అది కాదు. ఆమె అంతలా దిగులుపడుతూంటే తీసుకెళ్ళను నా మనసు అంగికరించడం లేదు"

"ఇదంతా లోకసహజమే బాబు! ... రాజీ! అల్లుడిగారి మంచితనం చూచావా? ఇకనైనా ఏడుపు మానవే తల్లీ!" విసుగ్గా అన్నాడు రాఘవయ్య.

ఇంతలో బస్సు వచ్చి వాళ్ళ ముందు ఆగింది. రాఘవయ్య బలవంతం మీద రాజీ బస్సులోకి ఎక్కింది. ట్రంకుపెట్టె ఆమెకందించాడు రాఘవయ్య. ఆమె వెనుకనే శేషగిరి బస్సెక్కాడు.

"జాగ్రత్తగా వెళ్ళి రండి" రాఘవయ్య గొంతు బొంగురుపోయింది.

బస్సు బయలుదేరింది.

బస్సు కనుమరుగయ్యే వరకు అలాగే చూస్తూ నిల్చున్నాడు రాఘవయ్య. కొన్ని నిముషాలు మనసు వికలమైంది. తన కూతురు మనసు నొప్పిస్తున్నానేమో అన్న ఆలోచన తొలిసారి మెదిలింది రాఘవయ్యకు. ఆ వేపచెట్టు నీడన కొన్ని నిమిషాలు అలాగే కూర్చుండిపోయాడు.

రాజీ తన కొక్కగానొక్క కూతురు. యుక్త వయస్సులో ఆమెకు కలిగిన కోరికను కాదన్నాడు. అందుకు కారణం "సాంప్రదాయం". రాఘవయ్య పక్కింటిలో వున్న శ్రీధర్‌ను రాజీ ప్రేమించింది. అతను అన్ని విధములా రాజీకి తగినవాడే. కానీ అతని కులం వేరు. ఆ వూరి ఆచారం ప్రకారం కులంగాని వాడిని పెళ్ళిచేసుకొంటే, వూళ్ళోవాళ్ళు వెలివేస్తారు. ఆ భయంవల్లనే రాఘవయ్య రాజీ కోరికను కాదన్నాడు. పరిస్థితి విషమించకుండా వుండేందుకు ఆమెకు వేరే సంబంధం చూచి పెళ్ళి చేశాడు. ఈ రోజు ఆమె అత్తగారింటికెడుతూంది. అక్కడికెళ్ళి తన మనసు మార్చుకోలేక ఏం అఘాయిత్యం చేస్తుందోనని దిగులుపడుతున్నాడు రాఘవయ్య. కొంత తడవుకు కానున్నది కాకమానదులెమ్మని సరిపెట్టుకొని వూరి వైపు సాగిపోయాడు.

అత్తగారింట అడుపెట్టిన రాజీకి ఓ భయంకర గుహలోకి ప్రవేశించినట్లుంది. ఇష్టంలేని మనువు. భర్త ఎంతగా ఆదరించినా, ఆప్యాయతతో చూచినా, ఆమె మనసు తన వూరి వైపు, తన వారి వైపు లాగుతూంది. ఆడపిల్ల మనసులో తొలిసారి ఏర్పడిన ఆ ముద్ర అంత ఘాఢమైనది కాబోలు. ఎదుట నిల్చున్నది భర్తే అయినా, ఆమెకు అతని స్థానంలో శ్రీధర్ కనిపిస్తున్నాడు. ఎంత మరిచిపోదామనుకున్నా ఆమె మర్చిపోలేకుంది. వివాహ వ్యవస్థతో ముడిపడిపోయిన ఆమె జీవితం మరొక రీకంగా మల్చుకోవడం ఇక సాధ్యంకానిది. సాంప్రదాయాన్ని దిక్కరించి ఈ బంధం తెంచుకొని వెళ్ళిపోయిన నాడు ఆమెను కులట, పతిత అని నిందిస్తుంది ఈ లోకం. శ్రీధర్‌తో జీవితం పంచుకోవాలన్న ఒకే ఒక కోరిక వల్ల ఆమె వైవాహిక బంధంలోని విలువను గుర్తించలేకపోతున్నది.

వారం రోజులు గడిచాయి.

రాజీ భర్త శేషగిరి ఆమెను ఎంతో అన్యోన్యంగా చూచుకుంటున్నాడు. కొత్తగా కాపురానికొచ్చిన ఆడపిల్ల మనసు నొచ్చుకోకూడదని, ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాడు. అయినా ఆమెలో మార్పులేదు ... ఎప్పుడూ స్తబ్ధంగా ముభావంగా వుంటూంది. భర్త కౌగిలి ఆమెకు ధృతరాష్ట్ర కౌగిలిలా వుంది. అతని అనురాగపూరిత మాటలు, ఆమెకు అతనొక వాజమ్మ అనిపిస్తున్నాయి. ఇతరులకు ఎంతో ప్రశాంతంగా నందనవనంలా తోచే శేషగిరి విశాలమైన ఇల్లు ఆమెకు తలుపులు వేయని జైలులా, అశాంతి నిలయంలా వుంది.

ఆ రోజు రాత్రి – ఆమె చాలా తీవ్రంగా ఆలోచించింది. తను ఈ నరకం భరించలేదు. ఈ బంగారు పంజరంలో ఇమడలేదు. లోకం ఏమనుకున్నా, తన భవితవ్యమేమై పోయినా, తను శ్రీధర్ వద్దకెళ్ళి పోవాలి. అతనితోటి ఈ విశాల ప్రపంచంలో ఎక్కడికైనా వెళ్ళిపోవాలి. అతనితోటి ఆనందం పంచుకోవాలి. తను లేకపోతే శ్రీధర్ బ్రతుకలేడు. శ్రీధర్ లేకుండా తను జీవించలేదు. రేపు ఏదొక కారణంగా తను పుట్టింటికని వెళ్ళిపోవాలి." ఆలోచిస్తూంది రాజీ.

"రాజీ! నీకింకా పుట్టింటి మమకారం తీరినట్లు లేదు. రేపు వెళ్ళి వారం రోజులపాటు అక్కడ వుండిరా. నేనే దిగబెట్టి వస్తాను". పక్కన పడుకున్న శేషగిరి అన్నాడు.

మనసెరిగి మసలుకొనే మగని మమకారం

అర్థంకాలేదామెకు తన కోరిక తీరడానికి భగవంతుడు శేషగిరి నోట ఈ మాట చెప్పించాడనుకుంది

రాజి మళ్ళీ పుట్టింటికి బయలుదేరింది తను మెట్టినింటికి ఇక తాను తిరిగిరాదు ఆ విషయం ఆ ఇంట్లో ఎవ్వరికీ తెలియదు భర్త కొన్నాళ్ళు బాధపడవచ్చు కానీ అతను మళ్ళీ పెళ్ళిచేసుకుంటాడు. హాయిగా వుంటాడు అనుకుంది

అత్తవారింటికెళ్ళిన వారం రోజులకే గుమ్మంలో అడుగుపెట్టిన కూతుర్ని చూచిన రాఘవయ్యకు గుండె గతుక్కుమంది రాజి తల్లి జానకి కళ్ళు పెద్దవిచేసి చూచింది

"రాజి బాగా దిగులుపడింది మామయ్యా' వారం రోజులపాటు ఇక్కడ వుంచి వెళ్ళాలని వచ్చాను. వాళ్ళ ప్రశ్నను వూహించుకున్న శేషగిరి, వాళ్ళు అడగక ముందే అన్నాడు

"రా బాబు! కూర్చో' రాఘవయ్య అనునయంగా అన్నాడు

శేషగిరి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు

జానకి వెళ్ళి మంచినీళ్ళు తెచ్చి అతని కందించింది

"బాబు' పశు పక్ష్యాదులలో సైతం ఈ కన్న మమకారం వుంటుంది. కాని భర్త అనే అనుబంధం ఏర్పడ్డాక, ఆ బంధం ముందు కన్న మమకారం లెక్కకు రాదు. ఏ తల్లిదండ్రులైనా తమ బిడ్డకు ఓ మంచి భర్త దొరకాలని అతనితో ఆమె జీవితం హాయిగా ఆనందంగా గడిచిపోవాలని కోరుకుంటారే గాని ఆమె ఎప్పుడూ ఓ చిన్న పిల్లగా తమ కళ్ళముందు వుండాలని కోరుకోరు. కొన్నాళ్ళు బాధనిపించినా కాలక్రమేణా ఆమె తన సంసారం, తన బాంధవ్యం అనే బంధాలపై మోజు పెరిగి ఒక గృహిణిగా మారిపోతుంది. కొత్త దంపతులు ఎప్పుడూ ఒకరికొకరు దూరంగా వుండకూడదు ఈ రోజుకు ఇద్దరూ ఇక్కడ వుండి. రేపు బయలుదేరి మి ఇంటికెళ్ళి పొండి' – రాఘవయ్య అన్నాడు.

"ఫర్వాలేదు మామయ్యా' ఒక్క వారం రోజులు ఆమెను ఇక్కడే వుండనివ్వండి మనసు కుదుట పడ్డాక, నన్ను చూడాలన్న కోరిక కలిగాకనే ఆమెను తీసుకెడతాను ఆమె దిగులుగా ముడుచుకుని కూర్చుని వుంటె నే చూడలేను." సర్ది చెప్పాడు శేషగిరి

ఆ రోజు సాయంత్రమే ఆయన తిరిగి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి రాజి ఏం తప్పటడుగు వేస్తుందోనని భయపడ్డాడు రాఘవయ్య. ఆ రాత్రి అతను మెళుకువగా గడిపాడు రాఘవయ్య వూహించినట్లే రాజి ఒక వేళప్పుడు మంచం మీద నుండి లేచింది శబ్దం కాకుండా వీధి తలుపు తెరుచుకొని, వీధి మలుపులో వున్న రామాలయం వైపు నడిచింది. ఆ చీకటిలోనే రాఘవయ్య ఆమెను అనుసరించాడు.

రామాలయం ప్రాంగణంలో వున్న పొన్నచెట్టు నీడన కూర్చుని వున్నాడు శ్రీధర్ ధైర్యంగా, దొరవగా అతని దగ్గరకెళ్ళింది రాజి శ్రీధర్ చటుక్కున పైకి లేచి నిల్చున్నాడు

'రాజి' అగు వెనక్కు జరిగాడు శ్రీధర్ చూపినదే తడవుగా తనను గాఢ పరిష్వంగనలో కి తీసుకుంటాడనుకున్న రాజి హతాశురాలైంది

పరాయివాణ్ణి అయ్యాను నేను నీ కోసమే






వచ్చాను. నాకున్న భార్య అనే హోదాను కూడా పరిత్యజించడానికి సిద్ధంగా వున్నాను. నన్ను నీ వెంట ఎక్కడికయినా తీసుకెళ్ళు. కులాలు. మతాలు అనే కుశ్చిత బావుకులు లేని, మనది అంటూ మరో ప్రపంచం ఏర్పరుచు కుందాము." ఆవేశంగా అంది రాజీ.

"రాజీ ... మధ్యాహ్నం నీవు నన్నిక్కడ కల్సుకొనమని సంకేతం పంపినప్పుడు, నిన్ను కల్సుకొనడానికి వచ్చింది. నీ కోరిక తీర్చడానికి కాదు ... నా మనస్సు చెప్పడానికి ..."

# హోదా...

"శ్రీధర్!" అదిరిపడింది రాజీ.

"అవును రాజీ! మనసా, వాఛా, కర్మణా నిన్ను ప్రేమించినది వాస్తవమే. ఈ సమాజంలోని కులమత భేదాలనే సాంప్రదాయపు అడ్డు గోడలను ఛేదించుకొని వచ్చి, నిన్ను పెళ్ళి చేసుకొనడం నాకు పెద్ద పనికాదు. కానీ ఆర్థికంగా నేను చాలా బలహీనుడను. లేమితో జీవించడం, ఆచరణ సాధ్యంకాదు. నీకు ఓ కలిగినింటి సంబంధం వచ్చిందని తెల్సుకున్న తర్వాత, నేను నిన్ను ప్రేమించింది నిజమే అయితే, ఏ ఆటంకము లేకుండా శేషగిరితో నీ పెళ్ళి జరిగిపోవాలనుకున్నాను. పైగా ఇంతకాలం నిన్ను పెంచి పోషించిన తల్లిదండ్రులకు నీ మనసు తెలిసి ప్రవర్తించాలనిపించలేదు. అలాలంటప్పుడు నేను పక్కకు తప్పుకోవడమే మంచిదనిపించింది. రాజీ! అదృష్టవశాత్తు నీవు అపవిత్రురాలివి కాలేదు. నీవు అన్ని యోగ్యతలున్న గృహిణివి. నీకున్న ఆ హోదాను నీవు కాలదన్నుకొని నా వెంట వచ్చి ఏమి సాధించలేవు. మనస్సు ఒక గాజు పాత్ర వంటిది. అందులో ఏభావం నింపుకుంటే, ఆ భావమే మెదులుతుంది. నీవు నన్ను మర్చిపో. నీ పెళ్ళైన రోజుతోనే మన మధ్య వున్న మానసిక అనుబంధం తీరిపోయింది. అందుకే నేనూ పెళ్ళిచేసుకున్నాను ... అనూరాధా!'..." పిలిచాడు శ్రీధర్.

చెట్టు చాటు నుండి ఓ స్త్రీ మూర్తి వాళ్ళ ముందుకొచ్చింది.

"ఈమె నా భార్య. పేరు అనూరాధ. నేను నిన్ను మర్చిపోడానికే ఈ పెళ్ళి ' చేసుకొన్నాను. ఆ చేసుకోవడంలో కూడా ఓ ప్రత్యేకత చూపించాలనుకున్నాను. ఈ అనూరాధ వితంతువు. రెండేళ్ళ క్రితం పెళ్ళైన ఈమె భర్త నెల రోజుల క్రితం చనిపోయాడు. ఆమె బ్రతుకు బుగ్గిపాలు కాకూడదన్న సత్సంకల్పంతో నేనామెను పునర్వివాహం చేసుకున్నాను ..."

"ఛీ ... ఛీ ... విధవను పెళ్ళాడావా?" చీదరింపుగా అంది రాజీ.

"రాజీ! భర్తను వదిలివచ్చిన నీకంటే భర్తను పోగొట్టుకున్న ఈమె హీనురాలు కాదు ..."

రాజీకి చెంప చెళ్ళమనిపించినట్లనిపించింది.

కొద్ది క్షణాలు మౌనం తర్వాత –

"రాజీ! నీకు భర్త వున్నాడు. నీకంటూ ఓ సంసారం ఏర్పడింది. ఆ సంసారం చక్కదిద్దుకుంటూ ఆదర్శ గృహిణివనిపించుకో. వయసుకు తగిన కోరికలు మనలో చెలరేగవచ్చు. అవి అదుపుతప్పకుండా కళ్ళాలు వేసి సరైన మార్గాన నడుపుకోవాలి. నీవు ఇలా నన్ను కల్సుకున్నావని ఎవరికైనా తెలిస్తే, నీ జీవితానికి మాయని మచ్చ ఏర్పడుతుంది. నీ భర్త నిన్ను శంకించి నిన్ను పరిత్యజించిననాడు, నీవు సమాజంలో పతితగా మిగిలిపోతావు. వెళ్ళు భార్య అనే పవిత్రమైన హోదాను కాపాడుకో!" అంటూ శ్రీధర్ అనూరాధ చేయి పట్టుకొని చీకట్లో ముందుకు సాగిపోయాడు.

దిమ్మెదరిగిపోయిన రాజీ కోలుకొనేసరికి రెండు నిమిషాలు పట్టింది. ఆమె భుజం మీద వాత్సల్య పూరితమైన చేయి పడింది.

"రాజీ ... పద ..." అని ఆమెను ఇంటికి నడిపించాడు రాఘవయ్య.

ఆ మరు రోజే రాజీ అత్తగారింటికి బయలు దేరింది. □